

శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయం హుండీలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన ఆదాయాన్ని పాలకవర్గం సోమవారం లెక్కించారు. ఇందులో నగదు రూ.6,82,033లు, బంగారం 8గ్రాముల 300 మిల్లీగ్రాములు, వెండి 46 గ్రాముల 700 మిల్లీగ్రాములు వచ్చాయని అధికారులు తెలిపారు.



శ్రీమందిరం భద్రతకు సరికొత్త వాహనం

శ్రీమందిరం భద్రతా వ్యవస్థలో సరికొత్త వాహనం చేరింది.

- 8లో



యువకుడిపై దుండగుల దాడి

దుండగుల దాడిలో ఒక యువకుడు కత్తిపోట్లకు గురైనట్లు జయపురం పట్టణ పోలీసులు వెల్లడించారు.

- 8లో

న్యూస్‌రీల్

ఉదయం ఎండ.. సాయంత్రం వర్షం



పర్లాకిమిడిలో గాలితో కూడిన వర్షం పడుతున్న దృశ్యం

పర్లాకిమిడి: పర్లాకిమిడి పట్టణంలో సోమవారం ఉదయం 40 డిగ్రీల ఉష్ణోగ్రతలు చవిచూసిన ప్రజలు సాయంత్రం నాలుగు గంటల సమయంలో ఉరుములు, గాలులతో చిన్నపాటి వర్షం కురిసింది.అగ్నికార్తెలు వల్ల పర్లాకిమిడి పరిసర ప్రాంతంలో ఉదయం నిప్పులు వంటి ఎండ కాస్తున్నది. ఉదయం భగభగ మండే ఎండతో ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతుండగా, సాయంత్రం కొద్ది పాటి వర్షంతో ఉపశమనం పొదారు.

క్రికెట్ టోర్నమెంట్ విజేత కేవిడి టీమ్



విజేత టీమ్‌కు ట్రోఫీ అందజేస్తున్న దియాన్

జయపురం: జయపురం సబ్ డివిజన్ కుంద్ర సమితి ఆసన పంచాయతీ చంజరాగుడలో నిర్వహించిన జయ మా క్రికెట్ టోర్నమెంట్ విజేతగా జయపురం సమితి కేవిడి గ్రామ టీమ్ నిలిచింది. ఫైనల్ మ్యాచ్‌లో కేవిడి టీమ్, జబాకావిడి టీమ్‌లు తలపడ్డాయి. టాస్ గెలిచిన జబాకావిడి జట్టు మొదట బ్యాటింగ్ చేసి 16 ఓవర్లలో 64 పరుగులు చేసి ఆలౌట్ అయ్యింది. 65 పరుగుల విజయ లక్ష్యంతో బ్యాటింగ్ ప్రారంభించిన కెవిడి టీమ్ 10.3 ఓవర్లలో ఛేదించి విజేతగా నిలిచింది. విజేతలకు మాజీ మంత్రి పద్మిణీ దియాన్ చేతులమీదుగా ట్రోఫీ అందజేశారు. కార్యక్రమంలో బ్లాక్ బీజేడీ బీజేడీ అధ్యక్షుడు బృంధావన మల్లిక్, సర్పంచ్ జయంతి కుసపారియ, సమితి సభ్యుడు గోరీ హరిజన్ తదితరులు పాల్గొన్నారు.

వందే భారత్ రైలు నడపాలి



మాట్లాడుతున్న రబినారాయణ నందో తదితరులు

జయపురం: భువనేశ్వర్ నుంచి విశాఖపట్నం వరకు నడుపుతున్న వందే భారత్ రైలుని కొరాపుట్, జయపూర్‌ల మీదుగా ఛత్తీషగడ్ రాష్ట్రంలోని జగదల్‌పూర్ వరకు నడపాలని రాష్ట్ర బీజేడీ ఉపాధ్యక్షుడు, మాజీ మంత్రి రబినారాయణ నందో కోరారు. సోమవారం ఆయన తన నివాసంలో విలేకరులతో మాట్లాడారు. జగదల్‌పూర్, జయపురం, కొరాపుట్, విశాఖపట్నంల మీదుగా రాష్ట్ర రాజధాని భువనేశ్వర్‌కు వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైలు నడిపితే నవరంగపూర్, మల్కన్‌గిరి, కొరాపుట్ జిల్లాల ప్రజలకు ప్రయాణ సౌకర్యాలు మెరుగవుతాయని పేర్కొన్నారు. అంతేకాకుండా ఈ ప్రాంతం ఆర్థిక, సామాజికంగా అభివృద్ధి చెందుతుందని అభిప్రాయపడ్డారు. ఆయనతో పాటు బీజేడీ సీనియర్ నేత బాలా రాయ్, జిల్లా పరిషత్ మాజీ సభ్యుడు బి.బాలంకిరావు, జయపురం బ్లాక్ బీజేడీ మాజీ అధ్యక్షుడు శివ పట్నాయక్‌లు ఉన్నారు.

వైద్య సేవకులకు నైటింగేల్ ఆదర్శనీయం



మాట్లాడుతున్న ప్రకాశ మహానందియ

జయపురం: ఎంతోమంది వైద్య సేవకులకు ఫ్లోరెన్స్ నైటింగేల్ ఆదర్శనీయురాలని సామాజిక కార్యకర్త ప్రకాశ మహానందియ అన్నారు. స్థానిక ఫ్లోరెన్స్ నైటింగేల్ ఏఎన్ఎం నర్సింగ్ శిక్షణా కేంద్రంలో అంతర్జాతీయ నర్సుల సేవా దినోత్సవం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా నర్సింగ్ శిక్షణ కేంద్రం డైరెక్టర్ భొత్ర మాట్లాడుతూ.. క్షతగాత్రులు, రోగులకు ఉత్తమ వైద్య సేవలు అందించాలనుకునే నర్సులు నైటింగేల్‌ను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. నర్సు వృత్తి ఎంతో పవిత్రమైనది పేర్కొన్నారు. కార్యక్రమంలో జ్యోతిర్మయి, వణిత నాయిక్, శాంతి భొత్ర, పాయల్ నాయిక్, అంచల బెహర, అభిమన్య బెనియ తదితరులు పాల్గొన్నారు.

సరికొత్త అవకాశాలు సృష్టించాలి



వార్షిక సంచిక ఆవిష్కరిస్తున్న దృశ్యం

- గవర్నర్ హరిబాబు కంభంపాటి
- ఘనంగా సాంకేతిక దినోత్సవం

భువనేశ్వర్: సాంకేతికత ఆవిష్కరణలకు పరిమితం కాకుండా మానవాళి సాధికారతకు దోహదపడి సంక్లిష్ట అడ్డంకుల్ని అధిగమించి, సరికొత్త అవకాశాలను సృష్టించాలని రాష్ట్ర గవర్నర్ డాక్టర్ హరిబాబు కంభంపాటి అన్నారు. జాతీయ సాంకేతిక దినోత్సవ వేడుక మరియు స్థానిక ఇనిస్టిట్యూషన్ ఆఫ్ ఇంజినీర్స్ (ఇండియా) 64వ వార్షిక సాంకేతిక సమావేశంలో ఆయన ప్రసంగించారు. ఈ సందర్భంగా మాట్లాడుతు దేశ సాంకేతిక నైపుణ్యత యాత్రలో మే 11, 1998 అత్యంత కీలకమైన దినంగా పేర్కొన్నారు. భారతదేశం ఆపరేషన్ శక్తి కింద పోఖ్రాన్‌లో అణు పరీక్షలను విజయవంతంగా నిర్వహించిందని, మన దేశాన్ని అణ్వాయుధ దేశాల ఉన్నత సమూహంలో ఉంచిందని చారిత్రాత్మక విజయాన్ని గుర్తు చేశారు. ఈ పరీక్షలు భారతదేశ శాస్త్రీయ పరాక్రమాన్ని మరియు స్వదేశీయంగా అభివృద్ధి చెందిన అణు సాంకేతికతను ప్రదర్శించాయన్నారు. జాతీయ సాంకేతిక దినం భారతదేశ ఆవిష్కరణల ధైర్యానికి, నాయకత్వ స్ఫూర్తి పునరుద్ఘాటన వేడుకగా పేర్కొన్నారు. వికసిత్ భారత్ ఆవిష్కరణ లక్ష్యంతో కృషి చేస్తున్న తరుణంలో అంతరిక్ష అన్వేషణ నుంచి వాతావరణ మార్పులు వరకు మన ఆకాంక్షలకు సాంకేతికత వెన్నెముక అన్నారు.

పరిశోధనల పాత్ర కీలకం

జాతీయ అభివృద్ధిలో ఆవిష్కరణలు, పరిశోధనల పాత్ర అత్యంత కీలకమన్నారు. ఇంజినీర్లు, సాంకేతిక నిపుణులు, యువకులు కలలు సాకారం చేసుకునే దిశలో ఆవిష్కరణలు చేసి సమగ్రతతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. గౌరవ అతిథిగా హాజరైన రాష్ట్ర ఆహార సరఫరాలు, వినియోగదారుల సంక్షేమం మరియు సైన్స్ అండ్ టెక్నాలజీ మంత్రి కృష్ణచంద్ర పాత్రో, దేశ అభివృద్ధిలో ఇంజనీర్ల పాత్రని ప్రస్తావించారు. విద్యార్థులు మరియు యువతలో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన వివిధ కార్యక్రమాలను పేర్కొన్నారు. ఇండియా ఇన్‌స్టిట్యూషన్ ఆఫ్ ఇంజినీర్స్ ఇండియా (ఐఈఐ) అధ్యక్షుడు వి.బి.సింగ్ కూడా సభలో ప్రసంగించారు. ఐఈఐ రాష్ట్ర శాఖ చైర్మన్ ప్రొఫెసర్ (డాక్టర్) సుధాంశు శేఖర్ దాస్, కార్యదర్శి సంగ్రామ్ కేశరి పట్నాయక్ ఈ కార్యక్రమంలో ప్రసంగించారు. అనంతరం సంస్థ వార్షిక సంచికని ఆవిష్కరించారు.



మాట్లాడుతున్న గవర్నర్ హరిబాబు కంభంపాటి



వార్షిక సాంకేతిక సమావేశంలో పాల్గొన్న సభ్యులు

భాష భావ వ్యక్తీకరణకు మూలం



వేడుకల్లో పాల్గొన్న సీఎం మోహన్‌చరణ్ మాఝీ తదితరులు

- సీఎం మోహన్ చరణ్ మాఝీ
- ఘనంగా అల్‌చికి లిపి శత వార్షికోత్సవం

భువనేశ్వర్: భాష భావ వ్యక్తీకరణకు మూలమని సీఎం మోహన్‌చరణ్ మాఝీ అన్నారు. మయూర్ భంజ్ జిల్లా రాయరంగ్‌పూర్ పరిధిలోని మొహుకొడిహా ప్రాంతంలో సంతాలి భాషకు చెందిన అల్‌చికి లిపి శత వార్షికోత్సవం సోమవారం నిర్వహించారు. అల్‌చికి లిపి ఆవిష్కర్త గురు గోమ్కే పండిట్ రఘునాథ్ ముర్ము జయంతి సందర్భంగా వేడుకలు చేపట్టారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. దండ్ బోస్ ప్రాంతంలో పండిట్ రఘునాథ్ ముర్ము నివాసాన్ని స్మారక తీర్థయాత్ర స్థలంగా తీర్చిదిద్దుతామని, ఆయన సమాధి స్థలానికి చారిత్రక స్మారక స్థలం హోదా కల్పిస్తామని ప్రకటించారు. అల్‌చికి లిపి శత వార్షికోత్సవ వేడుకలను రాష్ట్రవ్యాప్తంగా ఒక ఏడాది పాటు నిరవధికంగా నిర్వహిస్తామన్నారు. సంతాలి భాషను ప్రోత్సహించడానికి అంతర్జాతీయ సదస్సు నిర్వహించనున్నట్లు ప్రకటించారు.

రూ.50 కోట్లతో భాష ప్రాచుర్యం

పండిట్ రఘునాథ్ ముర్ము రాసిన అన్ని పుస్తకాలు ప్రాచుర్యం పొందేలా చేయడానికి బరిపదలో అల్‌చికి లైబ్రరీ, పండిట్ రఘునాథ్ ముర్ము ఓపెన్ థియేటర్ మ్యూజియం మరియు తన కార్యాలయంలో ఒక వారసత్వ భవనాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు. ఈ కార్యక్రమాల సమగ్ర వ్యయ ప్రణాళిక రూ.50 కోట్ల ప్యాకేజీగా తెలియజేశారు. పండిత్ రఘునాథ ముర్ము రచనలు కేవలం అక్షర జ్ఞానానికి పరిమితం కాలేదని, సాంస్కృతిక పురోగతిలో ఒక కొత్త అధ్యాయం ఆవిష్కరించాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ లిపికి, సంతాలి భాషకు నిరంతరం ప్రత్యేక ప్రాధాన్యతతో మద్దతు ఇస్తుందని హామీ ఇచ్చారు. ప్రాథమిక విద్యలో సంతాలి భాషా సంస్థలను స్థాపించడం, పాఠ్యపుస్తకాల ప్రచురణ, ఉపాధ్యాయులకు శిక్షణ మరియు భాషా అభివృద్ధి కేంద్రాలను సృష్టించడం ద్వారా ఉజ్వల భవిష్యతు ఆవిష్కరణకు బలమైన మార్గం సిద్ధం చేయనున్నట్లు ప్రకటించారు.

అద్భుతమైన వ్యక్తి రఘునాథ్ ముర్ము

కార్యక్రమానికి హాజరైన ఒడియా భాష, సాహిత్యం, సంస్కృతి మంత్రి సూర్యవంశీ సూరజ్ మాట్లాడుతూ పండిత్ రఘునాథ్ ముర్ము ఒక అద్భుతమైన వ్యక్తిగా కీర్తించారు. అతను నిరంతరం సుగంధం వెదజల్లే భాషా పుష్పమని కొనియాడారు. రాష్ట్ర గృహ నిర్మాణం, పట్టణ అభివృద్ధి విభాగం మంత్రి డాక్టర్ కృష్ణచంద్ర మహాపాత్రో పండిట్ ముర్మును విశేష శక్తులు కలిగిన వ్యక్తిగా అభివర్ణించారు. అటవీ, పర్యావరణ మంత్రి గణేష్‌రామ్ సింగ్‌కుంటియా తన ప్రసంగంలో ఈ పండుగ కారణంగా నేడు చరిత్ర పునరుద్ధరించబడిందన్నారు. అనంతరం ప్రఖ్యాత సంతాలి భాషా పరిశోధకుడు చుండా సోరెన్‌కు గురు గోమ్కే అంతర్జాతీయ అవార్డుతో పాటు రూ.1 లక్ష నగదు పురస్కారాన్ని సీఎం ప్రదానం చేశారు. పండిట్ ముర్ము వారసుడు చునియన్ ముర్ము, ప్రఖ్యాత సంతాలి రచయిత్రి, పద్మశ్రీ డాక్టర్ దమయంతి బేషారాను సత్కరించారు. కార్యక్రమంలో మయూర్‌భంజ్ జిల్లా ఎంపీలు మమతా మహంత, నవచరణ్ మాఝీ, రాయ్‌రంగ్‌పూర్ ఎమ్మెల్యే జలెన్ నాయక్, సారొసొకొణా ఎమ్మెల్యే భాదవ్ హంసదా, కరంజియా ఎమ్మెల్యే పద్మచరణ్ హైబురు, బరిపద ఎమ్మెల్యే ప్రకాష్ సోరెన్, బొడాసాహి ఎమ్మెల్యే సనాతన్ బిజులి, బంగిరిపోషి ఎమ్మెల్యే సంజిలి ముర్ము, పండిత్ రఘునాథ ముర్ము ట్రస్టు కార్యదర్శి ఇంజినీరు విశ్వేశ్వర టుడు తదితరులు పాల్గొన్నారు.

బుద్ధుడి విగ్రహం ధ్వంసం



ఫిర్యాదు చేస్తున్న జితు జకసిక తదితరులు



విగ్రహాన్ని ధ్వంసం చేసి కింద పడేసిన దుండగులు

రాయగడ: బుద్ధ పూర్ణిమ రోజున ఆవిష్కరించేందుకు ఏర్పాటు చేసిన బుద్ధుడి విగ్రహాన్ని గుర్తు తెలియని దుండగులు ధ్వంసం చేశారు. ఈ మేరకు జిల్లాలోని చందిలి పోలీసుస్టేషన్‌లో సోమవారం కేసు నమోదైంది. వివరాల్లోకి వెళ్తే.. చంపిగడు గ్రామ సమీపంలోని కొండపై బుద్ధుడి విగ్రహాన్ని ఏర్పాటు చేసేందుకు గ్రామస్తులు ఆదివారం నాటికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. అయితే సోమవారం విగ్రహాన్ని ఆవిష్కరించేందుకు వెళ్లగా అక్కడ విగ్రహం ధ్వంసమవ్వడం గమనించి ఆందోళన చెందారు. దీంతో గ్రామంలోని భగత్‌సింగ్ యువజన సంఘానికి చెందిన ప్రతినిధులు పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

హేయమైన చర్య

శాంతికి ప్రతిరూపమైన బుద్ధుడి విగ్రహాన్ని ధ్వంసం చేయడం హేయమైన చర్య అని బహుజన్ సమాజ్ జిల్లా శాఖ అధ్యక్షుడు జితు జకసిక అన్నారు. దుండగులను గుర్తించి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆదివారం రాత్రి సుమారు 11.30 గంటలకు చందిలి పంచాయతీ సర్పంచ్‌తో కలిసి కొందరు ఈ అఘాయిత్యానికి పాల్పడ్డారని పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

113 మంది అనాథ పిల్లలు గుర్తింపు



అంగన్‌వాడీలతో చర్చిస్తున్న అధికారులు

మల్కన్‌గిరి: జిల్లాలోని పోడియా సమితిలో మహిళా, శిశు సంక్షేమ కార్యాలయ ప్రాంగణంలో శిశు మంగళ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం ఒక ప్రత్యేక క్యాంప్‌ను నిర్వహించి 113 మంది అనాథ పిల్లలను గుర్తించారు ఈ క్యాంప్ ద్వారా తల్లిదండ్రులు లేని పిల్లలకు ప్రభుత్వం తరుపున ఉచిత హాస్టల్ సదుపాయం కల్పించి, మంచి విద్యనందించి భవిష్యత్‌ను తీర్చిదిద్దడమే లక్ష్యమని జిల్లా శిశు సురక్ష అధికారి నారాయణ్ దాస్ తెలిపారు. కార్యక్రమంలో జిల్లా శిశు మంగళ కమిటీ చైర్మన్ సంయుక్త ప్రధాన్, పోడియా సమితి అధ్యక్షురాలు రీనా రాణీ రాతా, చైల్డ్‌లైన్ సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

జస్టిస్ దీక్షిత్ కృష్ణ శ్రీపాద ప్రమాణ స్వీకారం

భువనేశ్వర్: ఒరిస్సా హైకోర్టు న్యాయమూర్తిగా జస్టిస్ దీక్షిత్ కృష్ణ శ్రీపాద సోమవారం ప్రమాణ స్వీకారం చేశారు. ఒరిస్సా హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి హరీష్ టాండన్ ఆయనతో ప్రమాణ స్వీకారం చేయించారు. సుప్రీంకోర్టు కొలీజియం గత నెలలో ఒరిస్సా హైకోర్టుకు బదిలీ చేయాలని సిఫార్సు చేసింది. ఈనెల 1న కేంద్రం ఆయన బదిలీని ప్రకటించింది. జస్టిస్ దీక్షిత్ కృష్ణ శ్రీపాద 1989 జూలైలో న్యాయవాది వృత్తిని చేపట్టారు. ఆయన ప్రధానంగా కర్ణాటక మరియు మద్రాస్ హైకోర్టుల్లో ప్రాక్టీస్ చేశారు. లా ఆఫ్ రైట్స్, ఎన్నికల చట్టాలు, సర్వీస్ చట్టాలలో ప్రత్యేకత సాధించారు. భారత ఎన్నికల కమిషన్‌కు సీనియర్ స్టాండింగ్ కౌన్సెల్‌గా, 1999లో అదనపు కేంద్ర ప్రభుత్వ స్టాండింగ్ కౌన్సెల్‌గా నియమితులయ్యారు. యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ), కాంపిటీషన్ కమిషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ), టెలికాం రెగ్యులేటరీ అథారిటీ ఆఫ్ ఇండియా (ట్రాయ్), కర్ణాటక వెటర్నరీ సైన్సెస్ యూనివర్సిటీ, బాబా అటామిక్ రీసెర్చ్ సెంటర్ మరియు నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ యునాని మెడిసిన్‌లకు స్టాండింగ్ కౌన్సిల్‌గా కూడా పనిచేశారు. 2014 సంవత్సరంలో ఆయన అసిస్టెంట్ సొలిసిటర్ జనరల్‌గా నియమితులై 2018 సంవత్సరం ఫిబ్రవరి 14 వరకు కర్ణాటక హైకోర్టు న్యాయమూర్తిగా పదోన్నతి పొందేవరకు ఆయన ఆ పదవిలో నిరవధికంగా కొనసాగారు. 2026 సంవత్సరం జూలై 19న తన పదవి నుంచి విరమణ చేయనున్నారు.



ప్రమాణ స్వీకారం చేస్తున్న జస్టిస్ దీక్షిత్ కృష్ణ శ్రీపాద

గవర్నర్‌తో కేంద్రమంత్రి భేటీ

భువనేశ్వర్: రాష్ట్రంలో గిరిజన వర్గాల అభ్యున్నతి కోసం రాష్ట్ర గవర్నర్ డాక్టర్ కంభంపాటి హరిబాబుతో కేంద్ర దళిత వ్యవహారాల మంత్రి జుయెల్ ఓరం చర్చించారు. దళిత సంక్షేమాన్ని బలోపేతం చేసి సమ్మిళిత అభివృద్ధి కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్లడంపై వీరివురు మధ్య సుహృద్భావ చర్చలు జరిగాయి. స్థానిక రాజ్ భవన్‌లో గవర్నర్ డాక్టర్ హరిబాబు కంభంపాటిని కేంద్రమంత్రి కలిశారు.



గవర్నర్ హరిబాబుతో కేంద్రమంతి జుయెల్ ఓరం

రఘునాథ్ పట్నాయక్ సేవలు చిరస్మరణీయం



రఘునాథ్ పట్నాయక్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

జయపురం: మాజీ మంత్రి దివంగత రఘునాథ్ పట్నాయక్ రాష్ట్రానికి అందించిన సేవలు మరువలేనివని వక్తలు పేర్కొన్నారు. ఆయన వర్ధంతి పురస్కరించుకొని జయపురం - మల్కన్‌గిరి మార్గంలోని పవర్ హౌస్ కూడలిలో విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. జయపురం నుంచి వరుసగా ఆరుసార్లు ఎమ్మెల్యేగా గెలిపొంది, కేబినేట్‌లో మంత్రిగా పదవులు చేపట్టారన్నారు. అలాగే లా రివిజన్ కమిషన్ చైర్మన్‌గా గుర్తింపు తెచ్చుకున్నారని గుర్తు చేశారు. ఆయన మంత్రిగా ఉన్న సమయంలోనే నల్కో, హాల్ ప్రాజెక్టులతో పాటు, జయపురం లా కళాశాల, మహిళా కళాశాలలు నెలకొల్పడడం జరిగిందన్నారు. కార్యక్రమంలో ప్రముఖ కాంగ్రెస్ నేత బినోద్ మహాపాత్రో, న్యాయవాది, కాంగ్రెస్ నేత మదన మోహన్ నాయిక్, జయపురం సాహిత్య పరిషత్ అధ్యక్షుడు హరిహర కరసుధా పట్నాయిక్, దుర్గా శతపతి, బీజేడీ కౌన్సిలర్ బి.విష్ణువర్ధణ రెడ్డి, రఘునాథ్ పట్నాయిక్ కుమారులు ధిరెన్ మోహన్ పట్నాయక్, ప్రతీష్ పట్నాయక్, ప్రియూష్ పట్నాయక్ తదితరులు పాల్గొన్నారు.

సురక్షిత రథయాత్రే లక్ష్యం

- డీజీపీ యోగేష్ బహదూర్

భువనేశ్వర్: ఈ ఏడాది పూరీలో సురక్షితంగా రథయాత్ర నిర్వహించడమే లక్ష్యమని రాష్ట్ర పోలీసు డైరెక్టర్ జనరల్(డీజీపీ) యోగేష్ బహదూర్ ఖురానియా అన్నారు. రథయాత్ర సన్నాహాలు సమీక్షించేందుకు ఆయన సోమవారం పూరీ ప్రత్యక్షంగా సందర్శించారు. ఈ సందర్భంగా శ్రీమందిరంలో స్వామివారిని దర్శించుకున్నారు. ప్రపంచ ప్రఖ్యాత పూరీ జగన్నాథుని రథయాత్ర సజావుగా నిర్వహించడంలో భక్తజన సమూహ నియంత్రణ, వ్యూహాత్మక వాహనాల రవాణా వ్యవస్థ, ప్రముఖుల కదలిక మధ్య దర్శనం క్రమబద్ధీకరణ అత్యంత కీలకమైన అంశాలుగా పేర్కొన్నారు. ఆద్యంతాలు రథాలు లాగడంపై ప్రత్యేకంగా దృష్టి సారించాలని వివరించారు. అనంతరం పూరీ జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో పలువురు సీనియర్ అధికారులతో లోతైన చర్చలు జరిపారు.

శ్రీమందిరం భద్రత వ్యవస్థ సమీక్ష

ఈ సందర్భంగా డీజీపీ శ్రీమందిరంలో భద్రతా ఏర్పాట్లను సమీక్షించారు. ప్రధానంగా ఆధునిక భద్రతా మౌలిక సదుపాయాల విస్తరణపై దృష్టి సారించారు. భద్రతా సమీక్షలో జనసమూహ నిర్వహణ వ్యూహాలు, సీసీటీవీ నిఘా కవరేజ్, శీఘ్ర ప్రతిస్పందన బృందాలు, స్థానిక పాలన యంత్రాంగంతో సమన్వయం యొక్క వివరణాత్మక విశ్లేషణతో భద్రతా కార్యకలాపల్ని సమీక్షించారు. రథయాత్రకు అశేష సంఖ్యలో తరలివచ్చే ప్రతీ భక్తుడు, యాత్రికుని భద్రత, రక్షణపై సమగ్ర యంత్రాంగం అంకితభావంతో కృషి చేయాలన్నారు. ఆపరేషన్ సింధూర్ నేపథ్యంలో తలెత్తిన ఉద్రిక్తత పరిస్థితుల మధ్య శ్రీమందిరం ప్రాంగణాల్లో భారీగా భద్రతా సిబ్బంది మోహరించారు. ఆలయం చుట్టుపక్కల కనీసం 240 మంది పోలీసు సిబ్బందిని ఉంచారు. 4 మంది సభ్యుల జాతీయ భద్రతా గార్డ్ (ఎన్ఎస్ జీ) కమాండోల బృందం వార్షిక భద్రతా సమీక్షలో భాగంగా రథయాత్రతో సహా ప్రధాన పండుగల సమయంలో ఉగ్రవాద నిరోధక చర్యలు మరియు రద్దీ నిర్వహణపై ప్రత్యేక కార్యాచరణతో ముందుకు సాగుతున్నట్లు అధికారులు వివరించారు. ఈ పరిస్థితులను తరచూ సమీక్షిస్తు సమయానుకూలమైన చర్యలతో భద్రతా వ్యవస్థని వ్యూహాత్మక పటిష్టపరిచే దిశలో సమగ్ర యంత్రాంగం కృషి చేయాలని సూచించారు.



సమీక్ష సమావేశం నిర్వహిస్తున్న దృశ్యం



భద్రతా ఏర్పాట్లు పరిశీలిస్తున్న డీజీపీ యోగేష్ బహదూర్

క్లుప్తంగా

53 రోజుల ఆదాయం రూ.7.31 లక్షలు



ఆలయంలో హుండీ లెక్కిస్తున్న భక్తులు

పాతపట్నం: పాతపట్నంలో కొలువైన ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం నీలమణిదుర్గ అమ్మవారి హుండీ ఆదాయం రూ.7,31,962లు వచ్చిందని ఆలయ ఈఓ టి.వాసుదేవరావు చెప్పారు. సహాయ కమిషనర్ కార్యాలయం దేవదాయ శాఖ అధికారి జీవీబీఎస్ రవి కుమార్ పర్యవేక్షణలో సోమవారం హుండీ ఆదాయం లెక్కింపు జరిగిందన్నారు. 53 రోజులగాను ఆదాయం వచ్చిందని చెప్పారు. లెక్కింపులో శ్రీవెంకటేశ్వరస్వామి సేవా సమితి సభ్యులు, అర్చకులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

పిడుగుపాటుకు వ్యక్తి మృతి



సరుబుజ్జిలి: మండలంలోని పాలవలస గ్రామానికి చెందిన దాసరి అప్పన్న (47) సోమవారం చిగురువలస సమీపంలో పిడుగుపాటుకు మృతి చెందాడు. ఆయన రోజూ లాగానే చిగురువలస పంచాయతీ పరిధిలోని తాడికొండ వద్ద గొర్రెల మందను నిలిపి ఉంచారు. ఈ సమయంలో వాతావరణంలో ఒక్కసారి మార్పులు ఏర్పడి ఈదురుగాలులు, వర్షం కురిసి పిడుగుపడింది. పిడుగు ప్రభావానికి తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందినట్లు స్థానికులు తెలిపారు. మృతునికి భార్య తులసమ్మ, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

జగన్నాథుని నిధులు కైంకర్యం

మందస: మందస మండలం సాబకోట గ్రామంలో జగన్నాథ స్వామి దేవాలయం నిధులు కైంకర్యం అయ్యాయని, దర్యాప్తు చేసి చర్యలు తీసుకోవాలని ఆ గ్రామస్తులు సోమవారం కలెక్టర్‌కు గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేశారు. ఈ దేవస్థానం కోసం మందస రాజులు 25 ఎకరాలు ఇచ్చారని, 18 మంది రైతులు ఆ భూములు సాగు చేస్తూ శిస్తు చెల్లిస్తున్నారని, కానీ అధికారుల పర్యవేక్షణ లేక గుడి శిథిలావస్థకు చేరుకుందని తెలిపారు. కార్యనిర్వహణ అధికారి అవినీతికి పాల్పడుతున్నారని వారు ఆరోపించారు. రికార్డుల్లో మాయ చేసి నిధులు కైంకర్య చేస్తున్నారని ఫిర్యాదు చేశారు. దీనిపై దర్యాప్తు జరపాలని కోరారు.

సాహితీవేత్త 'పులఖండం' కన్నుమూత



డాక్టర్ పులఖండం శ్రీనివాసరావు

శ్రీకాకుళం కల్చరల్: శ్రీకాకుళం సాహితీ రంగంలో ఎనలేని సేవలు అందించిన డాక్టర్ పులఖండం శ్రీనివాసరావు సోమవారం గుండె పోటుతో మృతి చెందారు. వృత్తిపరంగా గాయత్రీ కళాశాల ప్రిన్సిపల్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్న ఆయన సాహితీ రంగంలోనూ కృషి చేశారు. ముఖ్యంగా వ్యాఖ్యాతగా ఎన్నో కార్యక్రమాలను రమ్యంగా నిర్వహించారు. అష్టావధానం నిర్వహించడంలోనూ ప్రముఖ పాత్ర పోషించేవారు. శ్రీనివాసరావు విజయనగరం సంస్కృత కళాశాలలో విద్యనభ్యసించారు. ఆంధ్రా విశ్వవిద్యాలయంలో ఎంఏ తెలుగు, బరంపురం యూనివర్సిటీలో 'హరికథా వికాసం-ఉత్తరాంధ్రము'పై పరిశోధన చేసి డాక్టరేట్ పొందారు. పులఖండం మృతిపై సుమిత్ర కళాసమితి అధ్యక్ష, కార్యదర్శులు ఇప్పిలి శంకరశర్మ, గుత్తి చిన్నారావు, నక్కశంకరరావు, మండవిల్లి రవి, కిల్లాన ఫల్గుణరావు, రెడ్‌క్రాస్ చైర్మన్ పి.జగన్మోహనరావు, నిక్కు అప్పన్న, ఉపనిషన్మందిరం అధ్యక్ష, కార్యదర్శులు గుమ్మానగేష్, కామేశ్వరరావు, జంధ్యాల శరత్‌బాబు, నిష్టల నర్సింహమూర్తి, విశ్రాంత డీఈఓ బలివాడ మల్లేశ్వరరావు తదితరులు సంతాపం ప్రకటించారు.

ఆయన నేత్రాలు సజీవం



కింతలి చిట్టిబాబు

టెక్కలి: టెక్కలి చిన్నబజారుకు చెందిన వ్యాపారి కింతలి చిట్టిబాబు సోమవారం మృతి చెందడంతో, ఆయన కుటుంబ సభ్యులు చిట్టిబాబు నేత్రాలను దానం చేసేందుకు నిర్ణయించారు. ఈ మేరకు కుమారులు తిరుమలకుమార్, సురేష్‌కుమార్, అల్లుడు నేతాజీ గుప్తా తదితరులు పట్టణంలో అభయం యువజన సేవా సంఘానికి సమాచారం అందజేశారు. వారు రెడ్‌క్రాస్ చైర్మన్ జగన్‌మోహన్‌రావుకు సమాచారం ఇవ్వడంతో, మగటపల్లి కళ్యాణ్ నేత్ర సేకరణ కేంద్రం నుంచి వైద్య బృందం టెక్కలికి చేరుకుని చిట్టిబాబు నేత్రాల నుంచి కార్నియాలను సేకరించారు.

మద్యం తాగి వాహనం నడిపినందుకు 30 రోజులు జైలు

శ్రీకాకుళం క్రైమ్ : జిల్లాకేంద్రంలోని ఏడురోడ్ల కూడలిలో ఈనెల 9న మద్యం తాగి వాహనం నడిపిన వ్యక్తికి సోమవారం కోర్టు 30 రోజులు జైలు శిక్ష విధించినట్లు ట్రాఫిక్ సీఐ నాగరాజు వెల్లడించారు. పోలాకి మండలానికి చెందిన ఇర్రి శ్రీను ఈనెల 9న మధ్యాహ్నం 2.05 గంటలకు ఏడురోడ్ల కూడలిలో ట్రాఫిక్ పోలీసులకు డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడ్డాడు. వాహనాన్ని స్టేషన్‌కు తరలించిన ట్రాఫిక్ పోలీసులు శ్రీనుపై కేసు నమోదు చేశారు. ఛలానాయే కదా.. కట్టేయొచ్చనుకుని కోర్టుకు వెళ్లిన శ్రీనుకు న్యాయమూర్తి 30 రోజుల జైలు శిక్ష విధించారు.

శ్రీమందిరం భద్రతకు సరికొత్త వాహనం



శ్రీమందిరం భద్రతకు సాయుధ దళంతో వజ్ర వాహనం

భువనేశ్వర్: పూరీ శ్రీమందిరం భద్రత అనుక్షణం పటిష్టపరుస్తున్నారు. ఈ వ్యవస్థని అధునాతన సరంజామాతో విస్తరించే ప్రయత్నంలో భద్రతా విభాగం తలమునకలై ఉంది. ప్రసిద్ధ శ్రీజగన్నాథ ఆలయానికి భద్రతను పెంచారు. తాజా పరిస్థితుల దృష్ట్యా కమాండోలతో నిర్వహించే అత్యాధునిక రక్షణ వజ్ర వాహనం జోడించారు. ఆధునిక ఆయుధాలతో కూడిన ప్రత్యేక కమాండోలు దీనితో ప్రసిద్ధ ఆలయానికి రాత్రింబవళ్ళు 24 గంటల పాటు భద్రతను కల్పిస్తారు. అధునాతన ఆయుధాలతో సాయుధ కమాండోలను కూడా మోహరించారు. ఏదైనా అవాంఛనీయ సంఘటనను ఎదుర్కోవడానికి, యాత్రికులకు వారి భద్రత గురించి భరోసా కోసం ఈ చర్య దోహదపడుతుందన్నారు.



అశ్వ ద్వారం ఆవరణలో సాయుధ పోలీసుల భద్రత

రోడ్డుకు అడ్డంగా పడిన చెట్టు



చెట్టును తొలగిస్తున్న సిబ్బంది

పర్లాకిమిడి: ఒడిశా అంతటా ఎండలు మండిపోతున్న తరుణంలో గజపతి జిల్లా ఆర్.ఉదయగిరి బ్లాక్‌లో సోమవారం మధ్యాహ్నం ఈదురుగాలులతో కూడిన వర్షం కురిసింది. దీంతో మహేంద్రగడ వద్ద ఒక భారీ మామిడిచెట్టు రోడ్డుకు అడ్డంగా కూలింది. దీంతో బరంపురం నుంచి పర్లాకిమిడికి వెళ్లే 326-ఏ జాతీయ రహదారిపై సుమారు 3 గంటలసేపు రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. సంఘటన స్థలానికి ఆర్.ఉదయగిరి ఒడిషా రాష్ట్ర విపత్తుల సిబ్బంది, పోలీసులు విచ్చేసి చెట్టును తొలగించారు.

జాగిలాలకు శిక్షణ పూర్తి



శిక్షణ పూర్తి చేసుకున్న జాగిలాలు

భువనేశ్వర్: రాష్ట్ర జాగిలాల స్క్వాడ్‌లో ప్రత్యేక శిక్షణ పొందిన 2 జాగిలాలు కొత్తగా చేరాయి. తెలంగాణలో స్నిఫర్ డాగ్ ఉన్నత శిక్షణ పూర్తి చేసుకుని రాష్ట్రానికి తిరిగి వచ్చాయి. ఈ 2 జాగిలాలు బెల్జియన్ మాలినోయిస్ జాతికి చెందినవి. వాటిలో ఒకటి ట్రాకింగ్‌లో శిక్షణ పొందగా, మరొకటి వన్య ప్రాణుల వేటను గుర్తించడంలో శిక్షణ పొందినట్లు సంబంధిత అధికార వర్గాలు తెలిపాయి.

'సమస్యలు పరిష్కరించాలి'



మాట్లాడుతున్న యూటీఎఫ్ ప్రతినిధులు ఎస్.కిశోర్‌కుమార్, బమ్మిడి శ్రీరామ్మూర్తి

శ్రీకాకుళం న్యూకాలనీ: పాఠశాలల పునర్ వ్యవస్థీకరణ సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి సంపతిరావు కిశోర్‌కుమార్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. పాఠశాలల పునర్ వ్యవస్థీకరణ, ఉపాధ్యాయ బదిలీలు, పదోన్నతులకు సంబంధించిన సమస్యల పరిష్కారానికి జిల్లా విద్యాశాఖ కార్యాలయం ఎదుట యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఎల్.బాబూరావు అధ్యక్షతన సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా కిశోర్‌కుమార్ మాట్లాడుతూ అపరిష్కృతంగా ఉన్న ఉపాధ్యాయ సమస్యలు పరిష్కారం కాని పక్షంలో ఈ నెల 15వ తేదీన డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ సందర్భంగా ఆయన తమ ప్రధాన డిమాండ్లను వివరించారు. అనంతరం జిల్లా ప్రధాన కార్యదర్శి బమ్మిడి శ్రీరామమూర్తి మాట్లాడుతూ ఎస్జీటీలకు మాన్యువల్ కౌన్సిలింగ్ ద్వారా బదిలీ ప్రక్రియ చేపట్టాలని, ఉర్దూ మైనర్ మీడియం బోధించే ఉపాధ్యాయులను తెలుగు మీడియం ఎస్జిటి, ఎస్ఏలతో కలిపి లెక్కించి పోస్టులు కేటాయించడం సరికాదన్నారు. విద్యార్థుల సంఖ్య 75కు మించితే పీఎ స్ హెచ్ఎం పోస్ట్ అదనంగా కేటాయించాలన్నారు. అనంతరం యూటీఎఫ్ సంఘ పెద్దలు డీఈఓ తిరుమల చైతన్యకు, జిల్లా పరిషత్ సీఈఓకు, జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో వినతి పత్రాలను అందజేశారు.

అవి వైఎస్సార్ సీపీ హయాంలో వచ్చిన నిధులు

- ఎమ్మెల్సీ రామారావు



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ నర్తు రామారావు తదితరులు

కంచిలి: ఇచ్ఛాపురం నియోజకవర్గ పరిధిలో ఇటీవల కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేశారని, ఈ పనుల నిధులు వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలోనే వచ్చినవేనని ఎమ్మెల్సీ నర్తు రామారావు గుర్తు చేశారు. మండల కేంద్రం కంచిలిలో గల ఎమ్మెల్సీ కార్యాలయంలో పార్టీ నేతలతో కలిసి సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. సోంపేట మండలం బారువ కొండిరేవ బ్రిడ్జికి రూ.3కోట్ల 45 లక్షలు, మహేంద్రతనయ బ్రిడ్జికి రూ.14 కోట్ల 60లక్షలు, ఇచ్ఛాపురం మండలం బూర్జపాడు నుంచి పెద్దలక్ష్మీపురం వరకు రూ.4కోట్ల 86లక్షలు ప్రధాన మంత్రి సడక్‌యోజన కింద తారు రోడ్డు వేయడానికి, బూర్జపాడు ఉప్పుటేరుపై రూ.10కోట్ల 50లక్షలతో వంతెన నిర్మాణానికి ఆనాడు వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో శంకుస్థాపన చేసి, టెండర్లు పిలిచి, ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో ఆ పనులు తాత్కాలికంగా ఆగాయని అన్నారు. ఈ పనులు తామే తెచ్చామని కూటమి నాయకులు గొప్పగా చెప్పుకుంటున్నా.. నిజానికి ఆ ఘనత వైఎస్ జగన్‌కు దక్కుతుందని స్పష్టం చేశారు. సమావేశంలో ఎంపీపీలు పైల దేవదాస్‌రెడ్డి, డాక్టర్ నిమ్మన దాస్, బోర పుష్ప, కంచిలి జెడ్పీటీసీ సభ్యురాలు ఇప్పిలి లోలాక్షి, పార్టీ నేతలు నర్తు నరేంద్రయాదవ్, ఇప్పిలి కృష్ణారావు, తడక జోగారావు, దుర్గాసి ధర్మారావు, నర్తు ప్రేమ్‌కుమార్, డొక్కరి బలరాం, మద్దు వెంకటరావు, కొత్తకోట శేఖర్, బల్లెడ సుమన్, గణప సింహాచలం, రాంపత్ని చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

టెక్కలిలో కింజరాపు ట్యాక్స్

- మైనింగ్, లిక్కర్ వ్యాపారాల్లో కింజరాపు కుటుంబానికి పెద్ద ఎత్తున వాటాలు
- ధ్వజమెత్తిన వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పేరాడ తిలక్



మాట్లాడుతున్న పేరాడ తిలక్

టెక్కలి: టెక్కలి నియోజకవర్గంలో కింజరాపు ట్యాక్స్‌తో పెద్ద ఎత్తున దోపిడీ పర్వం కొనసాగుతోందని వైఎస్సార్‌సీపీ టెక్కలి నియోజకవర్గ ఇన్‌చార్జి పేరాడ తిలక్ మండిపడ్డారు. సోమవారం టెక్కలిలో మీడియా సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. గత ప్రభుత్వంలో ఎంతో పారదర్శకంగా ఏజెన్సీ వ్యవస్థతో ప్రభుత్వానికి ఆదాయం వచ్చేదని, ఇప్పుడు ఆ వ్యవస్థలను పక్కన పెట్టి విచ్చలవిడిగా కింజరాపు కుటుంబం మైనింగ్ దోపిడీ చేస్తోందని మండిపడ్డారు. టెక్కలి నియోజకవర్గంలో ఎలాంటి లీజు అనుమతులు లేకపోయినప్పటికీ అక్రమంగా కంకర తవ్వకాలు చేస్తున్నారని, దీనికి కింజరాపు ట్యాక్స్ కడితే చాలని తిలక్ దుయ్యబట్టారు. గోవిందపురం సమీపంలో సర్వే నంబర్ 71 లో వైఎస్సార్‌సీపీకి చెందిన మండపాక నర్సింగరావు అన్ని రకాల అనుమతులతో గ్రావెల్ క్వారీ నిర్వహిస్తుండగా, ఆ క్వారీలో మంత్రి అచ్చెన్నాయుడు, సోదరుడు హరిప్రసాద్ అక్రమంగా తవ్వకాలు చేసి కంకర తరలించేస్తున్నారని పేర్కొన్నారు. ఎలాంటి అనుమతులు లేకుండా చేస్తున్న గ్రావెల్ తరలింపు ఆపకపోతే వచ్చే సోమవారం గ్రావెల్ క్వారీను ముట్టడిస్తామని తిలక్ హెచ్చరించారు. టెక్కలి నియోజకవర్గంలో లిక్కర్ వ్యాపారానికి కింజరాపు ప్రసాద్, మైనింగ్ వ్యాపారానికి ఆయన కుమారుడు సురేష్ డాన్‌లుగా వ్యవహరిస్తూ పెద్ద ఎత్తున అక్రమాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. టెక్కలి నియోజకవర్గం నుంచి ప్రభుత్వానికి వెళ్లాల్సిన ఆదాయం కింజరాపు కుటుంబానికి వెళ్తోందన్నారు. ఒక బీసీ వర్గానికి చెందిన మహిళా మాజీ మంత్రి విడదల రజినిపై పోలీసుల ప్రవర్తన హేయమని తిలక్ మండిపడ్డారు.

యువకుడిపై దుండగుల దాడి



చికిత్స పొందుతున్న సమీర్

జయపురం: దుండగుల దాడిలో ఒక యువకుడు కత్తిపోట్లకు గురైనట్లు పట్టణ పోలీసులు వెల్లడించారు. గాయపడిన యువకుడు స్థానిక క్రిస్టియన్‌పేటకు చెందిన సమీర్ గుణియగా గుర్తించారు. క్షతగాత్రుడిని జిల్లా కేంద్ర ఆస్పత్రిలో చేర్చి ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన చికిత్స కోసం కొరాపుట్ లక్ష్మణ నాయిక్ వైద్య కళాశాల ఆస్పత్రికి తరలించారు. ఆదివారం సాయంత్రం సమీర్ గుణియ 26వ జాతీయ రహదారి స్వాతంత్ర్య సమరయోధురాలు దివంగత లక్ష్మీ పండ జంక్షన్ వద్ద కూర్చొని ఉండగా, కొంతమంది దుండగులు వచ్చి కత్తితో దాడి చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

జోరుగా రోడ్డు పనులు



రోడ్డు పనులు చేపడుతున్న దృశ్యం

పర్లాకిమిడి: జిల్లా కేంద్రంలోని ఫారెస్టు గేటు నుంచి పాత బస్టాండ్, కొత్త బస్టాండ్ మీదుగా పాతకోర్టు జంక్షన్ వరకు తారురోడ్డు నిర్మాణ పనులు జోరుగా సాగుతున్నాయి. స్థానిక ప్రజలు, ప్రజాప్రతినిధుల విన్నపాలు మేరకు పనులు చేపడుతున్నారు. సుమారు రూ.9 కోట్లతో పనులు జరుగుతున్నట్లు ఎస్ఈ అభిషేక్ శెరి తెలియజేశారు.

16 నుంచి అగ్ని గంగమ్మ పండగ



రాయగడ: స్థానిక పిట్టలవీధిలో అగ్ని గంగమ్మ అమ్మవారి వార్షిక పండగలు ఈనెల 16వ తేదీ నుంచి జరగనున్నాయి. 5 రోజుల పాటుగా జరిగే ఈ పండగలో అమ్మవారికి విశేష పూజలు నిర్వహిస్తారు. దీనికి సంబంధించి మందిరం ముస్తాబయ్యింది. హిందూ, ముస్లింలు కలిసి సాంప్రదాయబద్ధంగా పండగను నిర్వహించడం ఇక్కడి ప్రత్యేకత.

విద్యాదాస్‌కు ప్రతిష్టాత్మక అవార్డు



అవార్డు అందుకుంటున్న దాస్

రాయగడ: జిల్లాలోని కాసీపూర్ సమితిలో ఉన్న స్వచ్ఛంద సేవా సంస్థ అగ్రగామికి చెందిన జాయింట్ డైరెక్టర్ విద్యాదాస్‌కు ప్రతిష్టాత్మకమైన భగవాన్ మహవీర్ ఫౌండేషన్ అవార్డు లభించింది. చెన్నైలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో అవార్డు అందుకున్నట్లు సోమవారం తెలియజేశారు. విద్యారంగంలో చేసిన సేవలకు గానూ ఈ అవార్డును ప్రకటించినట్లు ఆమె తెలిపారు. అవార్డుతో పాటు రూ.10 లక్షల నగదు ప్రోత్సాహం అందించారన్నారు.

పుష్ప విలాసం



జిల్లా కేంద్రంలోని నారాయణతిరుమల కొండపై వెలసి ఉన్న వేంకటేశ్వర స్వామి కల్యాణోత్సవాలు కమనీయంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా సోమవారం స్వామికి పుష్పయాగం నిర్వహించారు. తీరొక్క కుసుమాల మధ్య వెంకన్నను దర్శించుకున్న భక్తులు మురిసిపోయారు. ఈ సందర్భంగా నిర్వహించిన తిరువీధిలో కోలాటం ఆకట్టుకుంది.

– శ్రీకాకుళం కల్చరల్

ఇసుక ట్రాక్టర్లను పట్టుకున్న తహసీల్దార్

సాక్షి ఎఫెక్ట్...



పొనుటూరు- రుగడ రోడ్డులో పట్టుకున్న రెండు ఇసుక ట్రాక్టర్లు

కొత్తూరు: పొనుటూరు గ్రామంలోని వంశధార నది నుంచి ఒడిశాకు అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను సోమవారం స్థానిక తహసీల్దార్ కె.బాలకృష్ణ పట్టుకున్నారు. ఇక్కడ అక్రమాలపై 'దేవుడి పేరుతో దోపిడీ' పేరిట సాక్షిలో సోమవారం కథనం ప్రచురితమైంది. దీనికి తహసీల్దార్ స్పందించారు. పొనుటూరు నుంచి ఒడిశాకు వెళ్తున్న రెండు ఇసుక ట్రాక్టర్‌లను పొనుటూరు-రుగడ రోడ్డులో పట్టుకుని తహసీల్దార్ కార్యాలయానికి తీసుకువచ్చారు. ఒక్కో ట్రాక్టర్‌కు రూ.పది వేలు చొప్పున అపరాధ రుసుం విధించారు. మరోసారి దొరికితే ట్రాక్టర్లను సీజ్ చేస్తామని తెలిపారు. అక్రమ వసూళ్లకు పాల్పడితే చర్యలు తీసుకుంటామన్నారు.

తొలిరోజు 279 మంది గైర్హాజరు

శ్రీకాకుళం న్యూకాలనీ: ఇంటర్మీడియెట్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు సోమవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. జిల్లా వ్యాప్తంగా 56 కేంద్రాల్లో జరుగుతున్న ఈ పరీక్షల్లో భాగంగా తొలిరోజు తెలుగు, సంస్కృతం, హిందీ పేపర్లకు సెట్-3 ప్రశ్న పత్రాలతో విద్యార్థులు పరీక్షలు రాశారు. తొలిరోజు సోమవారం ఉదయం ఫస్టియర్ విద్యార్థులు జనరల్, ఒకేషనల్ కలిపి 3709 మంది పరీక్షకు హాజరుకావాల్సి ఉండగా 3507 మంది పరీక్ష రాశారు. 202 మంది గైర్హాజరయ్యారు. అలాగే మధ్యాహ్నం సెకెండియర్ విద్యార్థులు 783 మంది పరీక్ష రాయాల్సి ఉండగా 706 మంది పరీక్షకు హాజరయ్యారు. 77 మంది డుమ్మాకొట్టారు. జిల్లా వ్యాప్తంగా సాయంత్రం ఈదురుగాలులతోపాటు ఆకాశం మేఘావృతమై ఉరుములు, పిడుగులతో కూడిన వర్షం కురవడంతో పరీక్ష కేంద్రాల్లో విద్యార్థులు ఆందోళన చెందారు. దీనికితోడు కరెంట్ పోవడంతో నానా అవస్థలు పడ్డారు. చిమ్మచీకట్లలోనే పరీక్షలు రాశారు.

ఆ 2 కిలోమీటర్లు..

- రణస్థలం, లావేరు మండలాల సరిహద్దులో అధికంగా రోడ్డు ప్రమాదాలు
- 24 గంటల్లో ఐదు ఘటనలు
- నెలలో కనీసం పది యాక్సిడెంట్లు
- అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్న స్థానికులు




ప్రమాదాలు జరిగే తాళ్లవలస, రావివలస మధ్య ప్రాంతం

రణస్థలం: లావేరు, రణస్థలం మండలాల సరిహద్దు ప్రాంతాలైన రావివలస, తాళ్లవలస గ్రామాల సమీపంలో రెండు కిలోమీటర్లు వాహన చోదకులను భయపెడుతున్నాయి. ఈ ప్రాంతంలో నెలకు కనీసం పది రోడ్డు ప్రమాదాలు జరుగుతుండడంతో వాహన చోదకులకు ఇది రెడ్‌జోన్ కింద మారింది. శనివారం అర్ధరాత్రి నుంచి ఆదివారం అర్ధరాత్రి వరకు ప్రమాదాల తీరు చూస్తే ఈ రెండు కిలోమీటర్లు ఎందుకంత ప్రమాదకరమో అర్థమవుతుంది. ప్రమాదం జరిగిన వెంటనే లావేరు, రణస్థలం లేక హైవే పెట్రోలింగ్ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని చకచకా క్షతగాత్రులకు సపర్యలు చేయడం లేదంటే మృతదేహాలను శవ పంచనామాలకు పంపించి కేసులు నమోదు చేసి మరిచిపోతున్నారు. కానీ ప్రమాదాలు నివారించేలా ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని ప్రజల నుంచి విమర్శలు వినిపిస్తున్నాయి.

24 గంటల వ్యవధిలో..

- తాళ్లవలస దగ్గర శ్రీకాకుళం వైపు నుంచి విశాఖపట్నం వైపు ద్విచక్రవాహనం వెళుతున్న యువకుడు జి. చిన్నబాబు అదుపుతప్పి శనివారం అర్ధరాత్రి గాయపడ్డాడు.
- తాళ్లవలస దగ్గర శ్రీకాకుళం వైపు నుంచి విశాఖపట్నం వైపు వస్తూ ఆటో బోల్తా పడి డ్రైవర్ ఆదివారం తీవ్రంగా గాయపడ్డాడు.
- రావివలస సమీపంలో ఆదివారం అర్ధరాత్రి 1.30 సమయం గ్రానైట్ లారీ ముందు వెళ్తున్న ఐరన్ లారీ ఢీకొట్టుకున్నాయి. వారు అక్కడే సెటిల్ చేసుకున్నారు.
- రావివలస సమీపంలో మొదట యాక్సిడెంట్ అయిన లారీని ఒక గంట తర్వాత మరో ఊక లారీ వెనుక నుండి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఊక లారీలో ఉన్న క్లీనర్ బెల్లంకొండ రమేష్ మృతి చెందాడు.
- రణస్థలం పాత పెట్రోల్ బంకు సమీపంలో విశాఖపట్నం ముందు వెళుతున్న లారీని వెనుక వచ్చిన మరో లారీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో సదాశివం అనే అనే క్లీనర్‌కు ఒక కాలు పూర్తిగా నుజ్జునుజ్జు అయిపోయింది.
- అతివేగం, ఎక్కువ మలుపులు, లారీలు ఎక్కడ పడితే అక్కడ ఆపేయడం, హెచ్చరిక బోర్డులు లేకపోవడం ప్రమాదాలకు కారణమని స్థానికులు అంటున్నారు.



ప్రమాదంలో లారీ నుజ్జు నుజ్జు కావడంతో క్రేన్‌తో లాగుతున్న దృశ్యం

వారెంట్లు, సమన్ల అమలుపై దృష్టి: ఎస్పీ

శ్రీకాకుళం క్రైమ్ : కేసులో కోర్టువారు జారీ చేసిన నాన్ బెయిల్‌బుల్ వారెంట్లు, సమన్ల అమలుపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి అధికారులను ఆదేశించారు. సోమవారం సాయంత్రం జిల్లా పోలీసు కార్యాలయం నుంచి డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలతో ఎస్పీ జూమ్ కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. సమన్ల వివరాలు తెలుసుకునేందుకు ప్రతి పీఎస్‌లో ప్రాసెస్ రిజిస్టర్ నిర్వహణ సక్రమంగా ఉండాలని, వ్యక్తిగత వివరాలు, చిరునామా, ఇతర ఆధారాలు, సాంకేతికతను అనుసరించి ఎన్బీడబ్ల్యూదారులను గుర్తించి కోర్టులో హాజరుపర్చాలన్నారు. ముఖ్యంగా సంఖ్య తగ్గేలా చూడాలన్నారు. ఎస్పీతో పాటు అదనపు ఎస్పీ కె.వి రమణ, డీసీఆర్బీ సీఐ శ్రీనివాసరావు, సైబర్ సెల్ సీఐ శ్రీను, ఎస్ఐ నేతాజీ పాల్గొన్నారు.

క్లుప్తంగా

కూలికి వెళ్లి.. విగతజీవుడై..

● విద్యుత్ షాక్‌కు గురై యువకుడి మృతి


చిరంజీవి(ఫైల్)

తెర్లాం: కుటుంబ పోషణ నిమిత్తం కూలి పనికోసం వెళ్లిన ఓ యువకుడు విగతజీవుడయ్యాడు. పెళ్లిలో టెంట్లు, లైటింగ్ పనులు చేసేందుకు వెళ్లిన యువకుడికి విద్యుత్ షాక్ తగలడంతో మృతిచెందాడు. ఈ ఘటనకు సంబంధించి సోమవారం తెర్లాం ఎస్సై సాగర్‌బాబు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని సింగిరెడ్డివలస పంచాయతీ పరిధి ఆమిటి సీతారాంపురం గ్రామానికి చెందిన కొత్తకోట చిరంజీవి(20) ఆదివారం కొల్లివలసలో జరిగిన ఓ వివాహానికి టెంట్లు, లైటింగ్ పనులు చేసేందుకు కూలికోసం వెళ్లాడు. పెళ్లి అయిన తరువాత టెంట్లు విప్పుతుండగా విద్యుత్ షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. చిరంజీవికి తండ్రి, ఇద్దరు అక్కచెల్లెళ్లు ఉన్నారు. వారిని పోషించేందుకు పెళ్లిళ్లు, ఇతర శుభ కార్యాల్లో టెంట్లు, లైటింగ్ పనులు చేసేందుకు కూలికి వెళ్తుంటాడు. విద్యుత్ షాక్‌కు గురై యువకుడు మృతిచెందిన సమాచారం తెలియడంతో తెర్లాం ఎస్సై సాగర్‌బాబు సిబ్బందితో వెళ్లి సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బాడంగి సీహెచ్‌సీకి తరలించారు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బైక్ అదుపుతప్పి వ్యక్తి మృతి


లక్ష్మణరావు (ఫైల్)

పాచిపెంట: మండలంలోని పద్మాపురం పంచాయతీ బడ్నాయక వలస గ్రామానికి చెందిన అంగర బోయిన లక్ష్మణరావు (31) బైక్ అదుపుతప్పి మృతి చెందాడు. ఈ ఘటనపై ఎస్సై వెంకట సురేష్ సోమవారం తెలిపిన వివరాలిలా ఉన్నాయి. లక్ష్మణరావు మద్యానికి బానిసై తరచూ భార్య ఉషారాణితో తగాదా పడుతూ ఉండేవాడు. రోజులాగానే ఆదివారం మద్యం తాగి ఇంటికి వచ్చి భార్యతో తగాదాపడ్డాడు. దీంతో తీవ్ర అసహనానికి గురైన భార్య ఇంట్లో ఉన్న ఏవో మాత్రలు మింగి ఆత్మహత్యాయత్నం చేసింది. వెంటనే ఆమెను స్థానికులు సాలూరు సీహెచ్‌సీకి తరలించారు. సాలూరులో చికిత్స పొందుతున్న భార్యను చూడడానికి లక్ష్మణరావు, ఆదివారం రాత్రి సుమారు తొమ్మిది గంటల సమయంలో ద్విచక్ర వాహనంపై సాలూరు వెళ్తుండగా పి.కోనవలస సమీపంలో ద్విచక్ర వాహనం అదుపుతప్పి విద్యుత్ స్తంభానికి ఢీ కొట్టాడు. ఈ ప్రమాదంలో లక్ష్మణరావుకు తీవ్ర గాయాలు కాగా 108 సహాయంతో విజయనగరం కేంద్రాస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ సోమవారం ఉదయం మృతిచెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు. మృతుడికి ముగ్గురు చిన్న పిల్లలు ఉన్నారు.

బైక్ ఢీ కొని వ్యక్తికి గాయాలు

కొమరాడ: మండలంలోని కంబవలస సచివాలయంలో డిజిటల్ సహాయకుడిగా పనిచేస్తున్న పి.శంకరరావు బైక్ ఢీకొని గాయాల పాలయ్యారు. దీనికి సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. ఆదివారం రాత్రి 10 గంటల సమయంలో లక్ష్మీపేట గ్రామానికి డిజిట్ అసిస్టెంట్ శంకరారావు వెళ్తుండగా జంఝావతి డ్యాం దాటిన వెంటనే గుర్తు తెలియని వ్యక్తి సారా కేన్లు బైక్‌తో తీసుకు వెళ్తూ మద్యం మత్తులో డిజిటల్ సహాయకడు శంకరరావును ఢీకొనడంతో ప్రమాదం జరిగింది. ఆయన హెల్మెట్ పెట్టుకున్నందున ముఖం, చేతికి చిన్నపాటి గాయాలయ్యాయి.

యువకుడి ఆత్మహత్య

సాలూరు: పట్టణంలోని డబ్బివీధికి చెందిన ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ మేరకు పట్టణ సీఐ అప్పలనాయుడు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. లారీ క్లీనర్‌గా పనిచేస్తున్న గంట దినేష్(29) మద్యానికి బానిసయ్యాడు. ఈ క్రమంలో సోమవారం మద్యానికి డబ్బులు ఇవ్వమని తల్లిని అడగగా, ఇంట్లో డబ్బులు లేవని తెలిపింది. దీంతో మనస్తాపానికి గురైన దినేష్ ఇంటిలో సీలింగ్‌ఫ్యాన్‌కు ఉరివేసుకున్నాడు. మృతుడి తల్లి విజయలక్ష్మి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదుచేశారు.

పీజీఆర్ఎస్ కు 136 అర్జీలు

విజయనగరం క్రైమ్: జిల్లా కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు మొత్తం 136 అర్జీలు అందాయి. ఈ సందర్భంగా అర్జీదారులు పూర్తిగా సంతృప్తి చెందే విధంగా వినతులను పరిష్కరించాలని కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, జాయింట్ కలెక్టర్ ఎస్.సేతుమాధవన్ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో అర్జీలను కలెక్టర్ అంబేడ్కర్, జేసీ సేతు మాధవన్, డీఆర్ఓ ఎస్.శ్రీనివాసమూర్తి, కేఆర్‌సీ ఎస్డీసీ మురళి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు వెంకటేశ్వరరావు, నూకరాజు పరిశీలించారు. ఆయా సమస్యలను వీలైనంత వేగంగా పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

సమస్యలకు చట్టపరిధిలో పరిష్కారం

విజయనగరం క్రైమ్: జిల్లాపోలీస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజాసమస్యల వేదికకు వచ్చిన ఫిర్యాదులను చట్టపరిధిలో పరిష్కరించాలని ఎస్పీ వకుల్‌జిందాల్ సిబ్బందిని ఆదేశించారు. డీపీవోలో ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించి వాటిని ఏడు రోజుల్లో పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. పీజీడీఆర్ఎస్ లో మొత్తం 46 ఫిర్యాదులను ఎస్పీ స్వీకరించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ సౌమ్యలత, ఎస్‌బీ సీఐలు లీలారావు, చౌదరి, డీసీఆర్బీ సీఐ సుధాకర్, ఎస్సై రాజేష్‌లు పాల్గొన్నారు.

చిత్తశుద్ధితో అర్జీలు పరిష్కరించండి

● కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్
● పీజీఆర్ఎస్‌కు అందిన 92 వినతులు

పార్వతీపురంటౌన్: ప్రజాసమస్యల పరిష్కార వేదిక ద్వారా అందిన అర్జీలను చిత్తశుద్ధితో పరిష్కరించాలని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ జిల్లా అధికారులను ఆదేశించారు. ఈ మేరకు కలెక్టరేట్ సమావేశ మందిరంలో పీజీఆర్ఎస్ కార్యక్రమం కలెక్టర్ అధ్యక్షతన సోమవారం జరిగింది. ఈ కార్యక్రమంలో 92 మంది అర్జీదారుల నుంచి వినతులను కలెక్టర్ స్వీకరించగా, జాయింట్ కలెక్టర్ ఎస్ఎస్ శోభిక, ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి అశుతోష్ శ్రీవాస్తవ,జిల్లా రెవెన్యూ అధికారి కె. హేమలత, ఎస్డీసీ పి.ధర్మచంద్రారెడ్డి, డీఆర్డీఏ పీడీ ఎం.సుధారాణి భాగస్వామ్యమై వినతులను అందుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పీజీఆర్ఎస్‌లో వచ్చిన అర్జీలపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని, కావున అర్జీలను చిత్త శుద్ధితో త్వరితగతిన పరిష్కారం చేఆయలని అధికారులను ఆదేశించారు.

అర్జీలు కొన్ని ఇలా..

- పాలకొండ నగర పంచాయతీలో పారుగు సేవల కింద శానిటేషన్ వర్కర్‌గా పనిచేస్తూ ఏసీబీకి పట్టుబడగా హైకోర్టులో కేసు ఉంది. దానిపై తుది తీర్పు రాకముందే ఆ పోస్టును భర్తీ చేస్తున్నారని, కావున తీర్పు వచ్చేంతవరకు దాన్ని నిలుపుదల చేయాలని పాలకొండకు చెందిన కొనపల వీరభద్రపురం వినతి పత్రాన్ని అందజేశాడు.
- గుమ్మలక్ష్మీపురం మండలం పాముల గీసాడ జంక్షన్ నుంచి చిన్న రావికోన గ్రామం వరకు తారు రోడ్డు వేయాలని చిన్న రావికోన గ్రామానికి చెందిన తోయక జమ్మన్న విజ్ఞప్తి చేశాడు.
- బలిజిపేట మండలం పెద్దింపేట నుంచి ముదిలి జనార్దన్ అర్జీని ఇస్తూ తమ గ్రామంలో జరిగిన ఉపాధి పనులకు సంబంధించి సుమారు 200 మంది వేతనదారులకు జనవరి మూడవ వారం నుంచి నేటివరకు వేతనాలు చెల్లించలేదని, వాటిని మంజూరు చేయాలని కోరారు.
- పార్వతీపురం మండలం డి.ములగ నుంచి చౌదరి రాణి వినతి పత్రాన్ని అందజేస్తూ, తాము పెయింటింగ్ చేసుకుంటూ జీవనం సాగిస్తున్నామని తమకు ఆధార్, రేషన్ కార్డులు లేనందున వాటిని మంజూరుచేయాలని కోరారు. కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, అర్జీదారులు పాల్గొన్నారు.


అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్


సీతంపేట: వినతులు స్వీకరిస్తున్న పీఓ యశ్వంత్‌కుమార్ రెడ్డి

చట్టపరిధిలో తక్షణ చర్యలు చేపట్టాలి

పార్వతీపురం రూరల్: ప్రజాసమస్యల పరిష్కార వేదికలో వచ్చిన ఫిర్యాదుల పరిష్కారానికి సకాలంలో చర్యలు తీసుకునేందుకు సంబంధిత అధికారులు చొరవ చూపాలని పార్వతీపురం మన్యం జిల్లా ఎస్పీ ఎస్వీ మాధవ్ రెడ్డి పేర్కొన్నారు. అలాగే చట్టపరిధిలో నాణ్యమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఈ మేరకు సోమవారం జిల్లా పోలీసు శాఖ కార్యాలయానికి జిల్లాలో ఉన్న పలు పోలీసు స్టేషన్‌ల పరిధిలో నుంచి వచ్చిన ఫిర్యాదులను ఎస్పీ ఎస్వీ మాధవ్ రెడ్డి చూసి ఫిర్యాదు దారులతో ముఖాముఖి మాట్లాడి క్షుణ్ణంగా పరిశీలించారు. ఫిర్యాదుల్లో ముఖ్యంగా కుటుంబ కలహాలు, భర్త, అత్తారింటి వేదింపులు, భూ ఆస్తి వివాదాలు, సైబర్ మోసాలు, నకిలీ పత్రాలు, అధిక వడ్డీల వసూళ్లు, ప్రేమ పేరుతో మోసాలపై ఎస్పీ 12 ఫిర్యాదులను స్వీకరించారు. కార్యక్రమంలో డీసీఆర్‌బీ సీఐ ఆదాం తదితర సిబ్బంది పాల్గొన్నారు.


ఫిర్యాదు దారులతో మాట్లాడుతున్న ఎస్పీ ఎస్వీ మాధవ్ రెడ్డి

ఐటీడీఏ గ్రీవెన్స్‌సెల్‌కు 22 వినతులు

సీతంపేట: స్థానిక ఐటీడీఏలోని ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో పీఓ సి.యశ్వంత్‌కుమార్ రెడ్డి సోమవారం నిర్వహించిన ప్రజాసమస్యల పరిష్కార వేదికకు 22 వినతులు వచ్చాయి. విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వేయించాలని భామిని మండలం సన్నాయిగూడ రైతులు కోరారు. వరదగోడ మంజూరు చేయాలని టిటుకుపాయిగూడకు చెందిన ఆరిక శ్యామల రావు, మల్లి గ్రామానికి చెందిన బూగన్న తాగునీటి సమస్య పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో ఏపీవో జి.చిన్నబాబు, ఈఈ రమాదేవి, పీహెచ్‌వో ఎస్‌వీ గణేష్, ఏటీడబ్ల్యూవో మంగవేణి, ఇన్‌చార్జ్ డిప్యూటీఈవో చంద్రరావు, ఏఎంవో కోటిబాబు, స్పోర్ట్స్ ఇన్‌చార్జ్ జాకాబ్ దయానంద్, ఏపీడీ సన్యాసిరావు తదితరులు పాల్గొన్నారు.

రామతీర్థంలో వైభవంగా పూర్ణాహుతి


యాగశాలలో పూర్ణాహుతి జరిపిస్తున్న అర్చకులు


రామ కోనేరు వద్ద చక్ర తీర్థ స్నానం జరిపిస్తున్న అర్చకులు

నెల్లిమర్ల రూరల్: సుప్రసిద్ధ పుణ్యక్షేత్రం రామతీర్థంలో శ్రీ వేణుగోపాలస్వామి కల్యాణ మహోత్సవాలు సోమవారం వైభవంగా ముగిశాయి. ఈ సందర్భంగా అర్చకస్వాములు చక్రతీర్థ స్నానం, పూర్ణాహుతి కార్యక్రమాలను అత్యంత ఘనంగా నిర్వహించారు. వేకువజామున స్వామికి ప్రాతఃకాలార్చన, బాలభోగం నిర్వహించిన తరువాత యాగశాలలో పూర్ణాహుతి హోమం జరిపించారు. అనంతరం శ్రీ సుదర్శన స్వామి పెరుమాళ్లను రామపుష్కరిణి వద్దకు పల్లకిలో ఊరేగింపుగా తీసుకువెళ్లి మంగళవాయిద్యాలు, వేద మంత్రోచ్చారణల నడుమ స్వామికి చక్రస్నానం చేయించారు. తరువాత గ్రామ బలిహరణ, బాలభోగం జరిపించి యాగశాలలో సుందరకాండ హవనం నిర్వహించారు. సాయంత్రం ధ్వజారోహణం చేపట్టి వేణుగోపాలుడి కల్యాణ మహోత్సవాలకు ముగింపు పలికారు. కార్యక్రమంలో అర్చకులు సాయిరామాచార్యులు, నరసింహాచార్యులు, కిరణ్, రామగోపాల్, భక్తులు పాల్గొన్నారు.

పనుకువలసలో ఎంఎస్‌ఎంఈ పార్కుకు శంకుస్థాపన రేపు

పార్వతీపురం/సీతంపేట: పాలకొండ నియోజకవర్గంలోని పనుకువలసవద్ద ఎంఎస్‌ఎంఈ పార్కుకు ఈనెల 14న ఉదయం 10 గంటలకు శంకుస్థాపన చేయనున్నట్లు ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ ఎం.మురళీమోహన్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ఎంఎస్‌ఎంఈ, సెర్ప్, ఎన్ఆర్ఐ సాధికారిత వ్యవహారాల శాఖమంత్రి కొండపల్లి శ్రీనివాస్ శంకుస్థాపన చేయనున్నారని పేర్కొన్నారు.

రెండు చూడి పశువుల దహనం

● వేపాడలో అగ్నిప్రమాదం
● మంటలు అదుపుచేసిన అగ్నిమాపక సిబ్బంది

వేపాడ: మండలకేంద్రం వేపాడలో ఆదివారం అర్ధరాత్రి జరిగిన అగ్నిప్రమాదంలో పశువుల పాక కాలిపోయి, రెండు చూడి ఆవులు సజీవ దహనం కావడంతో విషాదం నెలకొంది. ఇందుకు సంబంధించి స్థానికులు, బాధితులు అందించిన వివరాలిలా ఉన్నాయి. ఆదివారం రాత్రి గ్రామానికి చెందిన నిరుజోగి కృష్ణ తన పశువుల శాలలో రెండు చూడి ఆవులను కట్టి ఇంటికి వచ్చేశాడు. అర్ధరాత్రి సుమారు 2 గంటల సమయంలో పశువుల పాక కాలిపోతోందన్న సమాచారం తెలుసుకుని స్థానికులు కళ్లాలకు పరుగులు తీశారు. ఎస్.కోట అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించడంతో సంఘటనా స్థలానికి చేరుకుని మంటలు అదుపుచేశారు. అయితే ఈ ప్రమాదంలో పశువుల పాక కాలిపోవడంతో పాటు పాకలో ఉన్న రెండు చూడి ఆవులు సజీవ దహనమయ్యాయి. సుమారు రూ.రెండు లక్షల ఆస్తినష్టం ఉంటుందని అగ్నిమాపక సిబ్బంది అంచనా వేశారు. ఈ సమాచారం తెలుసుకున్న ఇన్‌చార్జి తహసీల్దార్ సన్యాసినాయుడు, వీఆర్ఓ కొండమ్మ తదితరులు గ్రామానికి వచ్చి పరిశీలించి నివేదికను కలెక్టర్‌కు పంపించారు.

ఉద్యోగాల కల్పనకు కృషి

● మంత్రి కొండపల్లి శ్రీనివాస్

గజపతినగరం రూరల్: ఉద్యోగ ఉపాధి అవకాశాలను పెంచేందుకు రాష్ట్ర ప్రభుత్వం మెగా జాబ్‌మేళాను నిర్వహిస్తోందని రాష్ట్ర సెర్ప్, ఎన్నారై వ్యవహారాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. ఈ మేరకు నియోజకవర్గ కేంద్రంలోని బాలికల ఉన్నత పాఠశాల ఆవరణలో ఏర్పాటుచేసిన మెగా జాబ్‌మేళాను సోమవారం ఆయన ప్రారంభించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ యువతలో నైపుణ్యం పెంచేందుకు శిక్షణ కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అలాగే ప్రతి నియోజకవర్గంలో ఎంఎస్‌ఎంఈ పార్కులను ఏర్పాటుచేయనున్నామన్నారు. పార్కుల ఏర్పాటు ద్వారా పారిశ్రామిక, వ్యాపార అభివృద్ధి కి శతశాతం కృషి జరుగుతుందని చెప్పారు. ఉత్తరాంధ్రలో పార్మా క్లస్టర్, పెట్రో కెమికల్స్, పరిశ్రమలు, స్టీల్స్‌పరిశ్రముల ఏర్పాటు కానున్నాయన్నారు. యువతకు వేతనం తక్కువైనా సరే అవకాశాన్ని అందిపుచ్చుకుని అనుభవాన్ని సంపాదించిన నాడు జీవితంలో మరింత ఉన్నతస్థాయికి చేరుకుంటారని సూచించారు. ప్రతి ఒక్కరు జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా నైపుణ్యాధికారి జి.ప్రశాంత్‌కుమార్, సంబంధిత శాఖ సిబ్బంది, టీడీపీ నాయకులు, పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది పలువురు పాల్గొన్నారు.


జాబ్‌మేళాలో యువతను ఉద్దేశించి మాట్లాడుతున్న మంత్రి శ్రీనివాస్

నీరుపేద రైతుల ఆందోళన

● సాగునీటి కష్టాలు తీర్చండంటూ వేడుకోలు
● ఇబ్బందులు పడుతున్న ఐదుగ్రామాల రైతులు
● సమస్య పరిష్కరించాలని కలెక్టరేట్ ఆవరణలో నిరసన



కలెక్టరేట్ ఆవరణలో నిరసన తెలుపుతున్న రైతులు

పార్వతీపురంటౌన్: కొమరాడ మండలం కోటిపాం గ్రామ ప్రజలు వనకాబడి గెడ్డ ఆయకట్టు ద్వారా వచ్చే సాగు నీటి ద్వారా వ్యవసాయపనులు చేస్తూ జీవనం కొనసాగిస్తున్నారు. గెడ్డపై కొత్త చెక్ డ్యాం నిర్మాణం చేపట్టడంతో తమకు సాగు నీరు అందడం లేదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ మేరకు సోమవారం పార్వతీపురం కలెక్టరేట్ వద్ద గ్రామస్తులు నిరసన తెలియజేశారు. అనంతరం కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ కోటిపాం గ్రామంలో 500 కుటుంబాలున్నాయని వనకాబడి గెడ్డ ఆయకట్టు నుంచి వచ్చిన నీటి ద్వారా వ్యవసాయం చేసుకుంటూ బతుకుతున్నామన్నారు. వనకాబడి గెడ్డ నుంచి వనకాబడి, బట్టిమాగవలస, చినఖేర్జల, లింగందొర వలస, బుర్జి వలస మీదుగా వచ్చి కోటిపాం కొత్తచెరువులో గెడ్డ నీరు కలుస్తుందని, చెరువు నిండిన తర్వాత ఈ చెరువు నుంచి సుమారు పది చెరువులు, బందలు నిండుతాయని, ఈ నీటి వనరుల మీదే తాము సాగుచేసుకుంటూ బతుకుతున్నామని తెలిపారు.

వెయ్యి ఎకరాలకు ఈ సాగు నీరే ఆధారం


వెయ్యి ఎకరాల సాగు ఈనీటి మీదే ఆధారపడి వ్యవసాయం చేస్తున్నామన్నారు. వనకాబడి ఆయకట్టు నీరు ప్రధానంగా కోటిపాం గ్రామానికి వస్తుంది. కావున గత 28న వనకాబడి గెడ్డపై చెక్ డ్యామ్ నిర్మించేందుకు పరిశీలించారని, దీనికి సంబంధించిన చెక్ డ్యాం నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేశారని తెలిపారు. ప్రస్తుతం ఉన్న పాత నిర్మాణం అలాగే ఉంటే తమ గ్రామానికి రావాల్సిన ఆయకట్టు నీటికి ఇబ్బంది ఉండదన్నారు. కానీ కొత్తగా చెడ్‌డ్యామ్ నిర్మించడం వల్ల మా గ్రామానికి రావాల్సిన నీరు ఆగిపోతుంది. దీంతో చాలామంది రైతులు ఇబ్బందికి గురవుతారని తెలియజేస్తున్నారు. తమ గ్రామ రైతులకు వ్యవసాయానికి ఈ చెక్‌డ్యాం ద్వారా వచ్చే నీరు మాత్రమే ఆధారమని, పరిశీలించి ఎవరికీ ఇబ్బంది కలగకుండా చేసి తమకు సాగునీరు అందించాలని కోరుతున్నారు.

రైతులను ఆదుకోండి



ఎన్నోఏళ్లుగా వ్యవసాయాన్ని నమ్ముకుని జీవనం కొనసాగిస్తున్న రైతులను అధికారులు ఆదుకోవాలి. వనకాబడి ఆయకట్టు గెడ్డపై నిర్మించనున్న చెక్ డ్యాం పనులను ప్రారంభించరాదు. సుమారు వెయ్యి ఎకరాలకు పైబడి సాగునీరు అందిస్తున్న గెడ్డపై ప్రస్తుతం ఉన్న చెక్‌డ్యాంను యథావిధిగా ఉంచి రైతులకు సాగునీటిని అందజేయాలి.
– పాండ్రంకి రామకృష్ణ, రైతు, కోటిపాం

కొత్త చెడ్‌డ్యామ్ నిర్మాణం వద్దు



గ్రామంలో 500మంది కుటుంబాలకు సంబంధించిన సుమారు 1000 ఎకరాలకు వనకాబడి గెడ్డ ఆయకట్టు ద్వారా వచ్చే సాగు నీటి ద్వారా పంటలు పండుతున్నాయి. ప్రస్తుతం ఉన్న చెక్‌డ్యాం ప్రాంతంలో కొత్తగా మరో చెక్ డ్యాం నిర్మాణం చేపట్టనున్నారు. దీనివల్ల రైతులకు తీవ్రనష్టం చేకూరుతుంది. అధికారులు ఈ విషయంపై పునరాలోచించి రైతులకు న్యాయం చేయాలని కోరుతున్నాం.
– ఎజ్జి గుంపస్వామి, రైతు, కోటిపాం

500 కుటుంబాల జీవనాధారం పోతుంది



నూతన చెక్‌డ్యాం నిర్మాణం వల్ల గ్రామంలో గల 500మంది కుటుంబాలకు జీవనాధారం పోతుంది. ఐదు గ్రామాలకు సాగునీటి కష్టాలు ఏర్పడతాయి. ప్రభుత్వం, అధికారులు పునరాలోచించి చెక్‌డ్యాం నిర్మాణం చేపట్టకుండా చూడాలి. ప్రస్తుతం ఉన్న చెక్‌డ్యాం ద్వారానే నీటిని సరఫరా చేయాలి.
– పప్పల సోమేశ్వరరావు, రైతు, కోటిపాం

ఆత్మరక్షణ విద్యలో ప్రావీణ్యం సాధించాలి

● ఒలింపిక్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు పురుషోత్తం
● ప్రారంభమైన మూడవ నేషనల్ తైక్వాండో సెమినార్


ఇరాన్ దేశానికి చెందిన ట్రైనీ అబ్బాస్ షేక్‌ను సత్కరిస్తున్న దృశ్యం


సెమినార్‌లో శిక్షణ పొందుతున్న క్రీడాకారులు

విజయనగరం: ఆత్మరక్షణ విద్య తైక్వాండోలో క్రీడాకారులు మరింత ప్రావీణ్యం సాధించి జాతీయ, అంతర్జాతీయ స్థాయి పోటీల్లో రాణించాలని ఒలింపిక్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.కె.పురుషోత్తం ఆకాంక్షించారు. ఈ మేరకు న్యూ ఆంధ్ర తైక్వాండో అసోసియేషన్ సారథ్యంలో జిల్లా తైక్వాండో అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 12వ తేదీ నుంచి 15 వ తేదీ వరకు విజయనగరంలోని రాజీవ్ స్టేడియంలో తలపెట్టిన మూడవ నేషనల్ తైక్వాండో సెమినార్ సోమవారం ప్రారంభమైంది. ఈ సెమినార్‌లో వివిధ రాష్ట్రాలకు చెందిన 120 మంది క్రీడాకారులు పాల్గొనగా..క్రీడాకారులకు ఇరాన్ దేశానికి చెందిన అబ్బాస్ షేక్ నూతన మెలకువలను నేర్పించారు. నాలుగు రోజుల పాటు జరిగే శిక్షణను క్రీడాకారులు సద్వినియోగం చేసుకోవాలని పురుషోత్తం సూచించారు. అంతర్జాతీయ యవనికపై తలపడే క్రీడాకారులకు ఈ సెమినార్ దోహదపడుతుందని పేర్కొన్నారు. సెమినార్‌లో నేర్చుకున్న అంశాలను నిరంతరం సాధన చేయడం ద్వారా ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. అనంతరం సెమినార్‌లో శిక్షణ ఇచ్చేందుకు వచ్చిన అబ్బాస్ షేక్‌ను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో తెలంగాణ తైక్వాండో అసోసియేషన్ కార్యదర్శి కె.శ్రీహరి, జిల్లా తైక్వాండో అసోసియేషన్ అధ్యక్షుడు గురాన అయ్యలు, కార్యదర్శి సీహెచ్ వేణుగోపాలరావు తదితరులు పాల్గొన్నారు.

సీతం కళాశాలలో 'ఇ-గేమ్' పుస్తకా విష్కరణ

విజయనగరం అర్బన్: సీతం కళాశాలలో 'ఈ-గేమ్ (ఎ డిఫరెంట్ అప్రోచ్ టు లెర్న్ ఇంగ్లీష్ విత్ ఫన్) అనే పుస్తక ఆవిష్కరణ కార్యక్రమం ఆదివారం జరిగింది. పెహల్గాం ఉగ్రదాడిలో మరణించిన పౌరులు, వీరమరణం పొందిన సైనికులకు తొలుత ఘనంగా నివాళులర్పించి వారి ఆత్మ శాంతి కోసం రెండు నిమిషాల పాటు మౌనం పాటించారు. ముఖ్యఅతిథిగా హాజరైన మాజీ ఎంపీ, సత్య సంస్థల కరస్పాండెంట్ డాక్టర్ బొత్స ఝాన్సీ లక్ష్మి మాట్లాడుతూ ఇ-గేమ్ (ఇంగ్లీష్ గ్రామర్ ఆక్సిస్ మేడ్ ఈజీ) పుస్తకం ద్వారా విద్యార్థులు సులభంగా, తర్కబద్ధంగా, సరదాగా ఇంగ్లీష్ గ్రామర్ నేర్చుకోగలుగుతారన్నారు. ఇందులో స్వప్టిప్స్ అనే 7 ప్రధాన అంశాల (వాక్యాలు, క్రియలు, ఆర్టికల్స్, స్పీచ్ భాగాలు, కాలాలు, ప్రశ్నార్థకాలు–ఆదేశాలు, పొజిషన్ మార్కులు)తో పాటు అడ్వాన్స్‌డ్ గ్రామర్, ప్రశ్నా బ్యాంకులు, రిడిల్స్, పాల్సేస్ వంటి వర్డ్ గేమ్‌లు, ఎక్సలుసీమ్, వెర్సనీమ్, ఫ్యాక్టనీమ్, స్లింగ్, ఐథెర్, స్పెల్ స్ప్రెడ్స్ వంటి వినూత్న అంశాలు ఉన్నాయన్నారు. ప్రతి ఒక్కరికి ఇంగ్లీష్ భాష అనివార్యమని, ఈ పుస్తకం ద్వారా అలవోకగా నేర్చుకోవచ్చని తెలిపారు.

మేన్ ఆఫ్ విజ్‌డం

సెంచూరియన్ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ జీఎస్ఎన్ రాజు మాట్లాడుతూ ఈ పుస్తకం విద్యార్థులలో ఇంగ్లీష్ భాషాపరమైన నైపుణ్యాలను అభివృద్ధి చేసి, ప్రపంచ స్థాయిలో పోటీతత్వం కలిగించగలదన్నారు. రచయిత ఆర్‌యూ నరసింహాన్ని 'మేన్ ఆఫ్ విజ్‌డం' అని ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో జేఎన్టీయూ–జీవీ రిజిస్ట్రార్ డాక్టర్ జయసుమ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. రచయిత ఆర్‌యూ నరసింహం పుస్తక విశేషాలను వివరించి, గ్రామర్ నేర్చే పద్ధతిని సరదాగా మార్చేందుకు ఈ పుస్తకం సహాయపడుతుందని తెలియజేశారు. కార్యక్రమంలో సీతం కళాశాల డైరెక్టర్ డాక్టర్. మజ్జి శశిభూషణరావు, ప్రిన్సిపాల్ డాక్టర్ డీవీ రామమూర్తి, విశాఖ సాంస్కృతిక పత్రిక ఎడిటర్-పబ్లిషర్ శ్రీ సిరెలా సన్యాసిరావు, ఇతర కళాశాలల ఇంగ్లీష్ అధ్యాపకులు, విభాగాధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.


పుస్తకావిష్కరణ చేస్తున్న మాజీ ఎంపీ డాక్టర్ బొత్స ఝాన్సీ లక్ష్మి తదితరులు

ఫీల్డ్ అసిస్టెంట్‌పై ఎంపీడీఓకు ఫిర్యాదు

● పని కల్పించాలంటూ వేతనదారుల ధర్నా

గంట్యాడ: జాతీయ గ్రామీణ ఉపాధి పథకంలో పనికి వెళ్లే వేతనదారులకు పనికల్పించకుండా నిర్లక్ష్యం వహిస్తున్నారంటూ ఫీల్డ్ అసిస్టెంట్‌పై గ్రామసర్పంచ్, వేతనదారులు సోమవారం ఫిర్యాదు చేశారు. పెదవేమలి గ్రామంలో గత వారం 160 మంది వేతనదారులకు పనికల్పించకుండా ఫీల్డ్ అసిస్టెంట్ అలసత్వం వహించారని, ఈవారం కూడా 30 నుంచి 40 మందివరకు వేతనదారులకు పనిలేకుండాచేశారని పెదవేమలి గ్రామ సర్పంచ్ వర్రి పాపునాయుడు ఎంపీడీఓ ఆర్‌వీ రమణమూర్తికి ఫిర్యాదు చేశారు. దీనివల్ల వేతనదారులు నష్టపోతున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. పని కావాలని వేతనదారులు డిమాండ్ చేస్తున్నప్పటికీ వారికి పని కల్పించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ఈ నేపథ్యంలో సదరు ఫీల్డ్ అసిస్టెంట్‌పై తగిన చర్యలు తీసుకుని వేతనదారులకు పనికల్పించాలని కోరారు.

పనికల్పించాలని ధర్నా

అలాగే మండలంలోని నరవ గ్రామానికి చెందిన వేతనదారులు సోమవారం ఎంపీడీఓకార్యాలయం ఎదుట తమకు పని కల్పించాలని ధర్నా నిర్వహించారు. ఉపాధి సిబ్బంది తీరు వల్ల తాము ఉపాధి కోల్పోయామని వాపోయారు.


ఎంపీడీఓ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న నరవ గ్రామం వేతనదారులు

ఫీల్డ్ అసిస్టెంట్‌గా చలామణి అవుతున్న మహిళపై ఫిర్యాదు

నరవ గ్రామంలో డ్వామా శాఖ నుంచి ఎటువంటి అపాయింట్ మెంట్ ఆర్డర్ లేకుండా షాడో ఫీల్డ్ అసిస్టెంట్‌గా చలామణి అవుతున్న మహిళపై చర్యలు తీసుకోవాలని అదేగ్రామానికి చెందిన నరవ సన్యాసిరావు సోమవారం కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ విషయంపై రెండు సార్లు ఫిర్యాదు చేసినప్పటికీ ఎటువంటి చర్యలు తీసుకోలేదని, పైగా సదరు మహిళకు ఉపాధి హామీ అధికారులు వత్తాసు పలుకుతున్నారని ఆరోపించారు. ఫీల్డ్ అసిస్టెంట్ మాదిరి మస్టర్లు పరిశీలించడం, పనులు పురమాయించడం చేస్తున్నారని ఆరోపించారు.

ముగిసిన ఆహ్వాన నాటిక పోటీలు


చీకటిపువ్వు నాటిక బృందానికి మెమెంటోతో పాటు నగదు బహుమతి అందజేస్తున్న కల్చరల్ అసోసియేషన్ ప్రతినిధులు

● ఉత్తమ ప్రదర్శనగా చీకటి పువ్వు నాటిక
● ద్వితీయ, తృతీయ ప్రదర్శనలుగా కొత్త పరిమళం, రైతేరాజు

చీపురుపల్లిరూరల్(గరివిడి): ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ఉభయ తెలుగు రాష్ట్రాల ఆహ్వాన నాటిక పోటీలు మూడు రోజుల పాటు వైభవంగా జరిగి ఆదివారం ముగిశాయి. గరివిడి కల్చరల్ అసోషియేషన్ ఆధ్వర్యంలో శ్రీరాం హైస్కూల్ ఆవరణంలో జరిగిన నాటిక పోటీల ప్రదర్శనలో..కరీంనగర్‌కు చెందిన చైతన్య కళాభారతి ఆధ్వర్యంలో ప్రదర్శించిన చీకటిపువ్వు నాటిక ఉత్తమ ప్రదర్శనగా నిలిచింది. అదేవిధంగా బొరివంకకు చెందిన శర్వాణి గ్రామీణ గిరిజన సాంస్కృతిక సేవా సంఘం ఆధ్వర్యంలో ప్రదర్శించిన కొత్త పరిమళం నాటిక ద్వితీయ ఉత్తమ ప్రదర్శనగా నిలవగా హైదారాబాద్‌కు చెందిన కళాంజలి ఆధ్వర్యంలో ప్రదర్శించిన రైతేరాజు నాటిక తృతీయ ఉత్తమ ప్రదర్శనగా నిలిచింది.

నగదు బహుమతుల అందజేత..

ఈ నాటికల ప్రదర్శనలో ఉత్తమ ప్రదర్శనగా నిలిచిన చీకటిపువ్వు బృందానికి రూ.15వేలు, ద్వితీయ ఉత్తమ ప్రదర్శనగా నిలిచిన కొత్త పరిమళం నాటిక బృందానికి రూ.12,500, తృతీయ ఉత్తమ ప్రదర్శనగా నిలిచిన నాటిక బృందానికి రూ.10వేలు నగదు బహుమతిని నిర్వాహకులు అందజేశారు. అలాగే ప్రతి నాటిక ప్రదర్శనకు రూ.25వేలు ప్రోత్సాహంగా అందజేశారు. అదే విధంగా కొత్త పరిమళం రచయిత కేకే.ఎల్ స్వామికి రూ.5వేలు, చీకటిపువ్వు నాటిక దర్శకుడు రమేష్ మంచాలకు రూ.5వేల నగదు బహుమతిని కల్చరల్ అసోసియేషన్ ప్రతినిధుల చేతుల మీదుగా అందజేశారు.